నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
10 | మహబూబ్‌నగర్, శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

లింగాల మండలంలోని సూరాపూర్ శివారులో వ్యవసాయంపై గురువారం విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. తెలకపల్లి మండలకేంద్రానికి చెందిన ఓ ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు వ్యవసాయ పొలాలకు తీసుకువెళ్లి కరిగెట చేయడం, వరినాట్లు వేయడం వంటి పనుల్లో భాగస్వాములను చేయించి వ్యవసాయ ప్రాముఖ్యతను వివరించారు. – లింగాల, ఫిబ్రవరి 20

రెండు రోజుల కిందట నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ సర్వేను అడ్డుకుంటున్న రైతులు

భరోసా దక్కేనా..?

- పేట-కొడంగల్ లిఫ్ట్‌లో భూములు కోల్పోయే రైతన్నల ఎదురుచూపు
- సర్వే పనులకు అడ్డంకులు తొలగేనా?
- నీటి విడుదలకు హామీ లభించేనా?
- మూడు మండలాల ప్రకటన అమలయ్యేనా.?
- నేడు నారాయణపేటకు సీఎం రేవంత్

నారాయణపేట, ఫిబ్రవరి 20 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గంలోకి వచ్చే నారాయణపేట జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించిన తన మానస పుత్రికగా భావించి ఏర్పాటు చేస్తున్న నారాయణపేట – కొడంగల్ ఎత్తి పోతల ప్రాజెక్టు పథకం సర్వే పనులు పోలీసుల నిర్బంధంలో కొనసాగడం గమనార్హం. ప్రాజెక్టు ఏర్పాటు వల్ల భూములు కోల్పోయే రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు ఏర్పాటు వల్ల ఒకింత రైతులు సంతోషపడాలో మరో వైపు ప్రాజెక్టు ఏర్పాటు వల్ల భూములు కోల్పోయే రైతులు బాధపడాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. వందల మంది పోలీసులు, రెండు అంకెల సంఖ్యలో డీఎస్పీ, సీఐ, ఎస్సైల పటిష్ట బందోబస్తు మధ్యన స్వయంగా రైతుల పొలాల్లో రైతులనే దగ్గరికి రాకుండా బలవంతంగా సర్వే చేపడుతూ వస్తున్నారు. ప్రాజెక్టు ఏర్పాటు వల్ల భూములు కోల్పోయే రైతులు, ఎట్టి పరిస్థితుల్లో తమ భూములు ఇచ్చేది లేదని, ఏం డ్ల తరబడి భూమినే నమ్ముకొని తాము జీవనం కొనసాగిస్తున్నామని తెగేసి చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో నారాయణపేట పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ఏదైనా భరోసా దక్కుతుందా అని రైతులకు వేచి చూస్తున్నారు.

నీటి విడుదల కోసం రైతుల ఎదురుచూపులు..

నారాయణపేట జిల్లా మక్తల్ మండలం సంగంబండ రిజర్వాయర్ నుంచి నీటి విడుదలలో అంతరాయం కారణంగా మక్తల్ మండల పరిసర గ్రామాలకు చెందిన వరి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంటలు ఎండుతున్నాయని వెంటనే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రిజర్వాయర్ మీద ఆధారపడి పంటలు వేశామని, అకస్మాత్తుగా నీటి విడుదలలో అంతరాయం ఏర్పడడంతో దిక్కుతోచడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నారాయణపేట బహిరంగ వేదిక మీద నుంచి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మూడు మండలాల ప్రకటన ఉసేది..?

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నారాయణపేట జిల్లాలోని నారాయణపేట మండల పరిధిలోని కోటకొండ, దామరగిద్ద మండలంలోని కాన్‌కుర్తి గ్రామాలను అదేవిధంగా నారాయణపేట నియోజకవర్గ పరిధిలోని కోయిల్‌కొండ మండలం గార్లపాడ్‌ను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామని గత ఏడాది నవంబర్ 26న జరిగిన ఎన్నికల ప్రచారంలో నారాయణపేట జిల్లా కేంద్రానికి పీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ హామీ ఇచ్చి 14నెలలు కావస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ ఊసే ఎత్తడం లేదు. ఈ విషయంపై ఇటీవల ఆయా మండల నాయకులు ఆందోళన బాట చేపట్టగా, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జోక్యం చేసుకొని ముఖ్యమంత్రి నోటి ద్వారా త్వరలోనే మూడు మండలాలు ప్రకటన చేయిస్తామని హామీ ఇచ్చి, ఆందోళనను విరమింపజేశారు. ఇది చెప్పి కూడా నెల రోజులు దాటింది. కానీ మండలాల ప్రకటనపై అతీగతి లేకుండా పోయింది. శుక్రవారం పలు అభివృద్ధి, శంకుస్థాపనల కోసం నారాయణపేట జిల్లా కేంద్రానికి వస్తున్న సీఎం అధికారికంగా మూడు మండలాలను ప్రకటిస్తారని ఆయా మండలాల ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

అండర్ గ్రౌండ్‌కే పరిమితమైన డ్రైనేజీ..

శాసనసభ ఎన్నికల సందర్భంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో నారాయణపేట మున్సిపాలిటీకి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని అప్పటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రస్తుత స్థానిక శాసన సభ్యురాలు పర్ణికారెడ్డి ఎంతో దూరదృష్టితో ఆలోచించి సభ వేదిక మీద పీసీసీ హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డిని కోరారు. ఆ తర్వాత ప్రసంగం మొదలు పెట్టిన రేవంత్‌రెడ్డి ఎన్నో ఏండ్ల చరిత్ర ఉన్న నారాయణపేటలో గత పాలకుల వైఫల్యం కారణంగానే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయలేని ఎద్దేవా చేశారు. కానీ అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ హామీ అండర్ గ్రౌండ్‌కు చేరిందని చెప్పవచ్చు. శాసన సభ్యురాలు అడిగిన మొదటి పనికి కూడా ఇప్పటి వరకు ఆచరణకు శ్రీకారం చుట్టలేదు. కనీసం ఈ వేదిక ద్వారానైనా స్థానిక శాసన సభ్యురాలు అడిగిన డిమాండ్ నెరవేరుతుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

యూరియా పాట్లు

- తీసుకునేందుకు పడిగాపులు
- యాసంగి పంటలపై భారం
- ఆందోళనలో అన్నదాతలు



మక్తల్ పీఏసీసీఎస్ వద్ద యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులు

కోడేరు/కొల్లాపూర్, ఫిబ్రవరి 20 : రైతులు యూరియా కోసం పాట్లు పడుతున్నారు. యాసంగి సీజన్‌లో వివిధ పంటలు సాగు చేయగా.. సరైన సమయంలో యూరియా వేయాల్సి ఉన్నది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్ష కట్టడంతో సరైన సమయంలో చేరక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రుణమాఫీ సగం మందికి కూడా వర్తించలేదు. రైతు భరోసాకు రేవంత్ సర్కారు పాతరేసింది. అయినా వ్యవసాయం తప్పా మరో పని తెలియని రైతు సొంత, వడ్డీకి తెచ్చిన డబ్బుతో పంటలు సాగు చేశాడు. కానీ ఎరువు కొరత తలెత్తింది. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రానికి యూరియా వచ్చిందని తెలుసుకొని రైతులు ఎగబడ్డారు. మండలంలో వానకాలం సీజన్‌లో 40 వేల ఎకరాలు, యాసంగిలో 35 వేల ఎకరాల వరకు పంటలు సాగయ్యాయి. అధికారుల అంచనా మేరకు.. వరి 7వేల ఎకరాల్లో, వేరుశనగ 2 వేల ఎకరాల్లో, మొక్కజొన్న వెయ్యి ఎకరాల్లో.. సాగైనట్లు అధికారుల అంచనా.. అయితే గురువారం నాటికి 195 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే అందుబాటులో ఉన్నది. కానీ 296 మెట్రిక్ టన్నుల యూరియా డిమాండ్ ఉందని అధికారులు తెలిపారు. పలువురు రైతులు యూరియా కోసం ఆరాటపడుతున్నారు. డిమాండ్ కంటే సప్లయి తక్కువగా ఉండటంతో దుకాణాల ముందు బారులు దీరుతున్నారు. కోడేరు సొసైటీకి యూరియా వచ్చిందన్న విషయం తెలియగానే రైతులు తెల్లవారు జాము నుంచే సింగిల్ విండో కార్యాలయానికి క్యూ కట్టారు. పెద్ద మొత్తంలో అక్కడకు చేరుకోవడంతో రైతులు మినీ యుద్ధమే చేయాల్సి వచ్చింది. దీంతో ఇదే అదునుగా ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణదారులు రూ.270లోపు ఉన్న యూరియా బస్తాను రూ.300 నుంచి రూ.350 ధరకు విక్రయించారు. ఎరువులను కొనుగోలు చేయక పంటల సాగును మానుకోవడం ఉత్తమని పలువురు వాపోయారు. ఎరువులు ఎంత అవసరం ఉంటాయో ముందస్తుగా అధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తారు. కానీ ప్రభుత్వానికి వ్యవసాయంపై ముందస్తు ప్రణాళిక లేక పోవడంతో యాసంగి పంటలకు ఎరువుల కొరత ఏర్పడింది. మండలంలోని 13 గ్రామాల్లో 27962.22 గుంటల భూమికి పాసు పుస్తకాలు ఉండగా.. ఇందులో ఇప్పటికే సర్వే పేరుతో 485.15 గుంటల భూమికి రైతు భరోసా రాకుండా బ్లాక్ లిస్టులో పెట్టినట్లు తెలిసింది.

రైతుల బారులు

వంగూరు, ఫిబ్రవరి 20 : మండలంలోని రంగాపూర్ సింగిల్‌విండో కార్యాలయం వద్ద గురువారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. కేవలం ఒక లారీలో 300 బ్యాగుల యూరియా రావడంతో రైతులు దాని కోసం రెండు గంటలపాటు క్యూలైన్‌లో నిల్చున్నారు. ఒక్కో రైతుకు 5 బ్యాగులు ఇవ్వాలని కోరగా ఒకే బస్తా ఇస్తామని అధికారులు చెప్పడంతో వారు తీసుకోవడానికి నిరాకరించారు. దీంతో రైతులు అధికారులపై ఒక్క సారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం వరకు మరో రెండు లారీల యూరియా వస్తుందని తిరిగి శుక్రవారం పంపిణీ చేస్తామని సీఈవో విష్ణుమూర్తి చెప్పడంతో రైతులు వెనుతిరిగారు.

అయితే మండలంలోని సుమారు 8500 ఎకరాల్లో రైతులు వరిని సాగు చేశారు. ఎకరాకు 5 బ్యాగుల చొప్పున అవసరమున్నా 42,500 బ్యాగుల యూరియా అవసరమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

వంగూరు : రంగాపూర్‌లో పీఏసీసీఎస్ సీఈవోని నిలదీస్తున్న రైతులు

తప్పని పడిగాపులు..

- రైతన్నకు యూరియా కష్టాలు
- గంటల తరబడి నిలబడినా అందని బస్తాలు
- దొడ్డిదారిన తెల్లచొక్కాలు వేసుకొచ్చే వారికి అందిస్తున్నారని ఆగ్రహం

మక్తల్, ఫిబ్రవరి 20 : రైతులకు రాయితీతో ఇవ్వాల్సిన యూరియాను నిజమైన వారికి ఇవ్వకుండా తెల్లచొక్కాలు వేసుకొచ్చే నాయకులకు ఇస్తున్నారని మక్తల్ సహకార సంఘం సభ్యులపై రైతులు ఆరోపణలు చేస్తున్నారు. గురువారం మక్తల్ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయానికి 900 బ్యాగుల యూరియా వచ్చింది. ఈ విషయం తెలుసుకొన్న రైతులు అక్కడకు చేరుకొన్నారు. గంటల తరబడి బారులుదీరినా తమకు అందించకుండానే నాయకులకు దొడ్డిదారిన ఇస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. ఉదయం నుంచి పడిగాపులు కాసినా చాలా మందికి అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులను పట్టించుకోకుండా వారికి కావాల్సిన వారికే అప్పగిస్తున్నారన్న మండిపడుతున్నారు. ఈ విషయమై కార్యాలయ కార్యదర్శి రాములును వివరణ కోరగా.. 900 బస్తాలు స్టాక్ ఉన్న విషయం వాస్తవమే.. నేను కార్యాలయానికి వెళ్లాక రైతుల ఆధార్ కార్డులను తీసుకొని బయోమెట్రిక్ చేసి రైతుల పాస్‌పుస్తకం ఆధారంగా ఒక్కో రైతుకు పది బస్తాల యూరియాను పంపిణీ చేశామన్నారు. వ్యవసాయ అధికారి మిథున్ చక్రవర్తి సంప్రదించగా.. రైతులకు యూరియా అందజేస్తామన్నారు. త్వరలోనే మళ్లీ లోడ్ వస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

రైతులను కాపాడాలి

కోడేరు శివారులో ఐదెకరాల్లో యాసంగి పంటగా మొక్కజొన్న సాగు చేశాను. పంటకు యూరియా వేసేందుకు అందుబాటులో లేదు. కొరత ఏర్పడడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కోడేరు విండో కార్యాలయంలో యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వం చర్యలు చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– శేఖర్ యాదవ్, రైతు, కోడేరు

మైనింగ్ పనులను నిలిపివేయాలి

- మైనింగ్ మాఫియా పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు రాసిన మైలారం గ్రామస్తులు

పోస్టుకార్డు ఉద్యమం చేపట్టిన మైలారం గ్రామస్తులు

బల్మూరు, ఫిబ్రవరి 20 : మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని మైలారం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మైలారం గుట్ట ముద్దు– మైనింగ్ వద్దు అనే నినాదంతో గ్రామస్తులు కొన్ని రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని, మైనింగ్ మాఫియా గ్రామస్తులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి పోస్టుకార్డులు రాసి పంపించారు. గ్రామానికి చెందిన దాదాపు 500 మంది ప్రజలు సీఎంకు పోస్టుకార్డులు రాసి పోస్టు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మైలారం మైనింగ్ వల్ల గుట్టకు ఆనుకొని ఉన్న ఇండ్లకు పగుళ్లు రావడంతో వ్యవసాయానికి అన్ని విధాలా నష్టం చేకూరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా దాదాపు పది గ్రామాల్లో మూగజీవాలకు మేత కూడా కరువవుతుందని అందుకే మైనింగ్ పనులు నిలిపివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఉత్తరాలు రాసి పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుట్ట పరిరక్షణ పోరాట సమితి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు దేవస్వామి, సత్య గౌడ్, లింగయ్య గౌడ్, పర్వతాలు, రమేశ్ గౌడ్, అనిల్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో ఫుడ్‌పాయిజన్

- 27 మంది విద్యార్థులకు అస్వస్థత
- యూనివర్సిటీలోనే చికిత్సలు..
- ఎమ్మెల్యే ఆగ్రహం

అస్వస్థతకు గురైన విద్యార్థినిని దవాఖానకు తరలిస్తున్న యూనివర్సిటీ సిబ్బంది

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 20 : జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని ఎన్ఎం ఐఎంఎస్(నిమ్స్) యూనివర్సిటీలో ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన గురువారం వెలుగుచూసింది. ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురైతే సత్వరమే విద్యార్థులను దవాఖానకు చేర్పించాల్సిన యూనివర్సిటీ యాజమాన్యం యూనివర్సిటీలోనే ఓ డాక్టర్‌తో వైద్యచికిత్సలు అందిస్తూ విషయం బయటకు రాకుండా రహస్యంగా ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న మీడియాను యూనివర్సిటీలోకి వెళ్లకుండా సెక్యురిటీగార్డుల చేత అడ్డుకున్నారు. చివరకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అక్కడికి చేరుకొని యూనివర్సిటీలో 27మంది విద్యార్థులు చికిత్స పొందుతున్న విషయాన్ని గుర్తించి యూనివర్సిటీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం కోసం దవాఖానకు తరలించాల్సిందే.. ఇక్కడే ఎందుకు వైద్యం చేస్తున్నారంటూ మండిపడ్డారు. వెంటనే విద్యార్థులందరినీ దవాఖానకు తరలించాలని లేదంటే కఠినంగా వ్యవహరించాల్సి వస్తోందని హెచ్చరించడంతో యూనివర్సిటీ యాజమాన్యం స్పందించి అంబులెన్స్‌లను రప్పించి ప్రైవేట్ దవాఖానలకు తరలించారు. అక్కడున్న మీడియా ఫొటోలు తీసేందుకు యత్నించగా యూనివర్సిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వైద్య, విద్యాశాఖాధికారులు శివకాంత్, జగదీశ్ యూనివర్సిటీ వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. యూనివర్సిటీలోని క్యాంటిన్‌లో వంటకాల్లో ఫుడ్‌పాయిజన్ కావడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు ఆరోపణలు ఉండగా, కొందరు విద్యార్థులు యూనివర్సిటీ బయటకు వెళ్లి హోటళ్లలో తినటంతో అస్వస్థతకు గురైనట్లు యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ చెబుతున్నారు

కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

హోరాహోరీగా జాతీయ స్థాయి కుస్తీ పోటీలు

- మొదటి విజేత కర్ణాటక మల్లయోధుడు
- రెండో విజేత తెలంగాణ మల్ల యోధుడు

అయిజ, ఫిబ్రవరి 20 : జాతీయ స్థాయి కుస్తీ (దంగల్) పోటీలు హోరా హోరీగా జరిగాయి. అయిజ పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గురువారం జాతీయ స్థాయి కుస్తీ (మల్ల యుద్ధం) పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానా రాష్ట్రాలకు చెందిన 25మంది మల్ల యోధులు తర లొచ్చారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో కుస్తీ పోటీలు నిర్వహించడంతో నడిగడ్డలోని పలు ప్రాంతాలకు చెందిన క్రీడా భిమానులు, జనం తిలకించేందుకు తండోప తండాలుగా తర లొచ్చారు. నువ్వా.. నేనా అనే రీతిలో మల్ల యోధులు కుస్తీపడ్డారు. ఫైనల్ పోటీల్లో కర్ణాటకకు చెందిన రాంచందర్ మొదటి స్థానం (రూ. 50 వేలు)లో నిలువగా, తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన పియా సింగ్ రెండో స్థానం (రూ. 25వేలు)తో సరి పెట్టుకున్నారు. మహారాష్ట్రకు చెందిన కమన్నా మూడో స్థానం (రూ.15 వేలు)లో నిలువగా, హైదరాబాద్‌కు చెందిన విజయ్‌కుమార్ నాలుగోస్థానం (రూ. 7 వేలు)తో సరి పెట్టుకున్నారు. విజేతలకు ఆలయ కమిటీ సభ్యులు నగదు బహుమతులను అందజేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మహ్మదాబాద్, ఫిబ్రవరి 20 : గొంతు కోసుకొని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన మండలంలోని చౌదరిపల్లిలో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చౌదరిపల్లి గ్రామానికి చెందిన కాశీం అనే యువకుడు హైదరాబాద్‌లో ఉంటు అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. గురువారం ఉదయం సదరు యువకుడు గ్రామంలో ఇంటి దగ్గర బ్లేడ్‌తో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా తీవ్ర రక్తస్రావం కావడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స నిర్వహించి మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ దవాఖానకు తరలించారు.

భోజనం బాగా లేదని.. విద్యార్థుల ఆందోళన

- అధికారుల హామీతో విరమణ

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 20 : నాణ్యమైన భోజనం అందించాలని, మెనూ పాటించడం లేదని విద్యార్థులు నిరసనకు దిగారు. వంట ఏజెన్సీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఉదయం 11 గంటలైనా వంట ఏజెన్సీ మహిళలు భోజనం వండడం ప్రారంభించలేదు. దీంతో విద్యార్థులు ఆగ్రహంతో 8, 9, 10వ తరగతి విద్యార్థులు బయటకు వచ్చి పాఠశాల ఆవరణలో బైఠాయించారు. భోజనం సక్రమంగా వండడం లేదని, సాయంత్రం స్నాక్స్ కూడా అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 398 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, భోజనం బాగా లేక కడుపు మాడ్చుకోవాల్సి వస్తుందని వాపోయారు. విద్యార్థులు ఆందోళనకు దిగిన విషయం తెలుసుకొన్న తాసీల్దార్ శ్రీరాములు, ఇన్‌చార్జి ఎంఈవో రఘునందన్‌శర్మ పాఠశాలకు చేరుకొని వారితో మాట్లాడారు. కొన్ని రోజులుగా వంట చేసే వారి ప్రవర్తన సరిగ్గా లేదని, భోజనం రుచిగా వండడం లేదని వారి దృష్టికి తెచ్చారు. ఎవరైనా ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని తెలిపారు. విద్యార్థులకు సరిపడా అందించడం లేదని, చాలీచాలనట్లుగా సరిపుచ్చుతున్నారన్నారు. వంట ఏజెన్సీ వెంటనే తొలగించి కొత్తవారికి అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. గురువారం 11 గంటలు దాటినా ఇంకా వంట ప్రారంభించలేదని చెప్పారు. కారణమైన వారిపై చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు. అనంతరం ఏజెన్సీ మహిళలతో అధికారులు మాట్లాడి భోజనం వండించారు. తర్వాత స్వయంగా అధికారులే విద్యార్థులకు భోజనం వడ్డించారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి

- నాగర్‌కర్నూల్ దవాఖాన ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన
- నాలుగు గంటలపాటు నిలిచిపోయిన వాహనాలు

నాగర్‌కర్నూల్‌లో ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 20 : రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఎదుట బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ధర్నా నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమైన ఆందోళన సాయంత్రం 4గంటల వరకు కొనసాగింది. ఈక్రమంలో అటు అచ్చంపేట, శ్రీశైలం, ఇటు మహబూబ్‌నగర్, హైదరాబాద్ వెళ్లే వాహనాలు బారులుతీరాయి. తాడూరు మండలం గుంతకోడూరు గ్రామం వద్ద బుధవారం కారు, బైకు ఢీకొని బైక్‌పై వెళ్తున్న తెలకపల్లి మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన శ్రీనివాసులు, శేఖర్ మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని, నష్టపరిహారం అందించాలని కోరుతూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, సగర సంఘం నాయకులు దవాఖాన ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకోచేపట్టారు. కలెక్టర్, ఎమ్మెల్యే రావాలని నినాదాలు చేశారు. ఈక్రమంలో భారీగా వాహనాలు నిలిచిపోగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నపిల్లలు, మహిళలు అవస్థలు పడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కొన్ని వాహనాలను మళ్లించారు. అయినప్పటికీ అప్పటికే పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఎంతకూ ఆందోళన విరమించకపోవడంతో సీఐ కనకయ్య ఘటనా స్థలానికి చేరుకొని నచ్చజెప్పడంతో ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్, జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు, నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన సగర సంఘం నాయకులు, బంధువులు పాల్గొన్నారు.